

సొంత భవనాలు కరువు

జిల్లాలోని చాలా పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో పాఠశాలల్లో కొనసాగుతున్నాయి.

- 11లో ▸



వ్యాన్‌లోనే 'పాస్‌పోర్ట్' సేవలు

జిల్లాకేంద్రంలోని పాస్‌పోర్టు సేవా కేంద్రం అగ్ని ప్రమాదంలో కాలిపోవడంతో మొబైల్ వ్యాన్‌లోనే సేవలు అందిస్తున్నారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
30.5 /23.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'లంచం తీసుకుంటే సహించను'



నిజాంసాగర్: రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు లంచాలు తీసుకుంటూ ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తున్నారని, అలాంటివారిని ఉపేక్షించబోనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హెచ్చరించారు. సోమ వారం ఆయన వాట్సాప్ వీడియోను రిలీజ్ చేశారు. జుక్కల్ నియోజకవర్గంలో రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న కొందరు అధికారులు లంచాలు ఇవ్వనిదే పనులు చేయడం లేదన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. లంచాలకు అలవాటు పడిన అధికారులు జుక్కల్ నియోజకవర్గాన్ని వదిలి వెళ్లాలని, లేకపోతే పద్ధతి మార్చుకుని పనిచేయాలని సూచించారు.

రుణమాఫీపై మంత్రికి ఫిర్యాదు

నిజాంసాగర్: రైతుల పేరిట మాగి గాయత్రి కర్మాగారం తీసుకున్న రుణాలపై విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ఈ విషయమై సోమవారం వ్యవసాయశాఖ మంత్రిని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల పేరుతో గాయత్రి కర్మాగారం రూ. 9 కోట్ల రుణాలు తీసుకుందని పేర్కొన్నారు. రుణమాఫీ డబ్బులు రైతులకే అందేలా చూడాలని మంత్రిని కోరానని తెలిపారు.

నల్లమడుగు నేలమత్తడికి బుంగ



లింగంపేట: నల్లమడుగు శివారులోని పెద్ద వాగు నేలమత్తడికి బుంగపడి నీరు వృథాగా పోతోంది. బుంగకు మరమ్మతులు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మత్తడి ఆధారంగా నల్లమడుగు, రామలక్ష్మణ్‌పల్లి గ్రామాల శివారులోని 2,500 ఎకరాలలో పంటలు సాగవుతాయి. బుంగ వల్ల నీరు వృథాగా పోతుండడంతో ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గండికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నిండుకుండలా కళ్యాణి

ఎల్లారెడ్డిరూరల్: తిమ్మారెడ్డి శివారులోని కళ్యాణి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 408 అడుగులతో నిండుకుండలా ఉందని నీటి పారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. రెండు రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరద గేట్లను మూసి వేశామన్నారు.

జన్మభూమి రోడ్డులో ఏర్పడిన గుంతలు



గతుకుల దారిలో..
అవస్థల ప్రయాణం

- జిల్లా కేంద్రంలో అధ్వానంగా రోడ్లు
- అడుగడుగునా గుంతలు..
- పట్టించుకోని పాలకులు

కామారెడ్డి రూరల్ : జిల్లా కేంద్రంగా ఎదిగినా కామారెడ్డి పట్టణంలో రోడ్ల పరిస్థితి మారలేదు. గతుకుల దారిలో నడక కూడా నరకప్రాయంగా మారింది. పాలకులు దృష్టి సారించకపోవడంతో ప్రజలకు అవస్థల ప్రయాణం తప్పడం లేదు.

కామారెడ్డి పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రధానంగా జన్మభూమి రోడ్డు, అశోక్‌నగర్ రోడ్లు గుంతలమయంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారుల్లో సైతం కంకరతేలి, గుంతలు ఏర్పడ్డాయి. కొత్తబస్టాండ్ నుంచి అశోక్‌నగర్‌లోని రైల్వే గేటు వరకు రోడ్డంతా కంకర తేలింది. జీవదాన్ ఆస్పత్రి నుంచి జన్మభూమి రోడ్డు, పాత సాయిబాబా ఆలయం, మూడు అపార్ట్‌మెంట్ల వరకు రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. గుంతలతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ ప్రాంతంలో ఎక్కువ పాఠశాలలు ఉండడంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచి నడవడానికి కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పట్టణంలోని రోడ్లపై వాహనదారులూ అవస్థలు పడుతున్నారు. అడుగడుగునా గుంతలు ఉన్నా మరమ్మతులపై పాలకులు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. అక్కడక్కడ అడుగు లోతు గుంతలున్నాయని, దీంతో అవస్థలు పడుతున్నామని ప్రజలు పేర్కొంటున్నారు. మరమ్మతులు చేయించి, అవస్థలు తప్పించాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న అశోక్‌నగర్ రోడ్డు







జిల్లాకేంద్రంలోని జన్మభూమి రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

ప్రమాదాలు జరుగుతున్నాయి



పట్టణంలోని జన్మభూమి రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలు పడి నీరు నిలుస్తోంది. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గుంతలను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చూడాలి.

– రఘుపతి, జన్మభూమి రోడ్డు కాలనీవాసి, కామారెడ్డి

పట్టించుకునే వారు లేరు



జిల్లా కేంద్రంలో ప్రధానమైన రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. జన్మభూమి రోడ్డులో అక్కడక్కడ అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు, పాలకులకు చెప్పినా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయించాలి.

– రాము, అశోక్‌నగర్ కాలనీవాసి, కామారెడ్డి

మరమ్మతులు చేయాలి



కామారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి అశోక్‌నగర్ రైల్వే గేటు వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై వెళ్తుంటే ఎక్కడ పడిపోతామోనని ఆందోళనగా ఉంటుంది. అధికారులు స్పందించి వెంటనే రోడ్లపై అవసరమైన మరమ్మతులు చేయించాలి.

– షేక్ హుస్సేన్, అశోక్‌నగర్ కాలనీవాసి, కామారెడ్డి

కష్టపడితేనే ఉన్నతి సాధ్యం

- జ్ఞానాన్ని సమాజ హితానికి ఉపయోగించాలి
- విద్య నిగూఢమైన, తరగని సంపద
- ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



బోధన్‌లో ప్రవచనామృతాన్ని అందిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

బోధన్ : కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే వృద్ధిలోకి వస్తారని ప్రముఖ ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. చదువు ద్వారా పొందిన జ్ఞానాన్ని సమాజహితం, ధర్మరక్షణకు ఉపయోగించాలని సూచించారు. సోమవారం బోధన్‌లోని విజయ సాయి ఉన్నత పాఠశాలలో 'విలువలతో కూడిన విద్య' అనే అంశంపై ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్య నిగూఢమైన తరగని సంపదన్నారు. చదువుతో కీర్తి ప్రతిష్టలు, సుఖసంతోషాలు, సమున్నత స్థానం దక్కుతాయన్నారు. దేశ దశదిశలను మార్చే శక్తి విద్యకు ఉంటుందని, ఆలోచించి విజ్ఞత, విచక్షణతో మాట్లాడాలని సూచించారు. మాటల్లో స్పష్టత, నిర్భయత్వం ఉండాలన్నారు. రామాయణం, మహాభారతంలలోని పలు ఉదంతాలను ఆయన ప్రస్తావించారు. సత్యమే పలకాలని, అబద్ధాలాడితే నమ్మకం కోల్పోతారని పేర్కొన్నారు.

ఓర్పు, సహనం కలిగి ఉండాలి

ప్రతి మనిషికి ఓర్పు, సహనం ఉండాలని చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. సహనం కోల్పోతే సమాజంలో శాంతిభద్రతలు అదుపుతప్పుతాయన్నారు. కన్న తల్లి, భూమాతలకు ఉన్న ఓర్పు గురించి వివరించారు. కోపం, క్షణికావేశాలు జీవితాలను సర్వనాశనం చేస్తాయన్నారు. పాము కుబుసాన్ని వదిలిపెట్టినట్టు మనుషులు కోపాన్ని వదిలించుకోవాలని సూచించారు. కష్టపడేవారికి ఎదురుదెబ్బలు తగులుతాయని, చిన్నపాటి కష్టాలకు కుంగిపోయి నిరాశ నిస్పృహలకు గురికావద్దని పేర్కొన్నారు. చాగంటి ప్రవచనాలు ఆద్యంతం విద్యార్థులను ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పురప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు

నేడే రెండో విడత రుణమాఫీ

- జాబితాలో జిల్లాకు చెందిన 24,816 రైతు ఖాతాలు
- రూ. 211.72 కోట్ల లబ్ధి

కామారెడ్డి క్రైం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుల పంట రుణాల మాఫీ రెండో విడత నిధుల విడుదలకు వేళయ్యింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంనుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రక్రియను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల నుంచి ఉన్నతాధికారులు, వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు వర్చువల్ విధానంలో కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇందుకోసం కామారెడ్డి కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు చేశారని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాగ్యలక్ష్మి తెలిపారు. రెండో విడత రుణమాఫీకి సంబంధించిన రైతుల జాబితా విడుదలయ్యిందని పేర్కొన్నారు. రెండో విడతలో రూ.1.50 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తారని తెలిపారు. జిల్లాలో 24,816 రైతు ఖాతాలకు సంబంధించి రూ. 211.72 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్నాయని పేర్కొన్నారు.

రీడింగ్ తెలుసుకోడానికే స్మార్ట్ మీటర్లు

- ఉచిత విద్యుత్ ఇవ్వవద్దని కేంద్రం చెప్పలేదు
- అసెంబ్లీ సమావేశాల్లో కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేవీఆర్

కామారెడ్డి క్రైం : ఉదయ్ స్కీం కింద కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టమని కోరిందే కానీ ఉచిత కరెంట్ ఇవ్వకూడదని చెప్పలేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు మీటర్ల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు అనేది రీడింగ్ తెలుసుకోవడం కోసమేనని, దాన్ని పెట్టినా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంట్ ఇవ్వవచ్చని పేర్కొన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న అన్‌మ్యాన్డ్ వర్కర్లు, మీటర్ రీడింగ్ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. వెలుగు చూస్తున్న విద్యుత్ అక్రమాలపై హౌజ్ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఓవర్ లోడ్ కారణంగా ఎందరో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని కోరుతూ డీడీలు కట్టినా సకాలంలో ఏర్పాటు చేయడం లేదన్నారు. విద్యుత్ లైన్‌కు 30 మీటర్ల పైబడిన దూరం ఉన్న ఇళ్లకు వేలల్లో డబ్బులు కట్టాలని అడుగుతుండడం సరికాదన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టి అలాంటి వాటిని ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. రైతులకు ఉచితంగా విద్యుత్ లైన్ వేసి ఇవ్వాలన్నారు. చాలాచోట్ల ఇళ్లపై నుంచి ప్రధాన విద్యుత్ లైన్ తీగలు వెళ్తున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంనుంచి తలపడిన ముగ్గురం కూడా సభలో ఉండే అవకాశం ఇచ్చిన కొడంగల్, గజ్వేల్, కామారెడ్డి ప్రజలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తనపై పోటీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష నేత కేసీఆర్‌లతో కలిసి తాను కూడా అసెంబ్లీకి రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ఉద్యమ బాట

'రాష్ట్ర ప్రభుత్వం తలుచుకుంటే ఎస్ఎస్ఏలోని కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు గంటలో పరిష్కారమవుతాయి. కూర్చొబెట్టి మాట్లాడితే చాయ్ తాగేలోపు చర్చలు జరిపి జీవోలు ఇచ్చి వారి సమస్యను పరిష్కరించవచ్చు. మీరు కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి అదనంగా ఒక గంట పని చేయండి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మీ సమస్యలన్నింటినీ పరిష్కరించే బాధ్యత నాది..' గతేడాది ఆగస్టులో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా శిబిరాన్ని రేవంత్‌రెడ్డి సందర్శించి పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడిన మాటలివి.. కానీ ఆ పార్టీ అధికారంలోకి వచ్చి, రేవంత్‌రెడ్డి సీఎం అయ్యి 8 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ తమ సమస్యల ఊసెత్తడం లేదని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- సమస్యల పరిష్కారానికి నేడు 'చలోఅసెంబ్లీ'



ఆర్మూర్ : సమగ్రశిక్ష(ఎస్ఎస్ఏ) ఉద్యోగులు మరోసారి ఉద్యమబాట పట్టారు. తమ సమస్యల పరిష్కారం కోసం జేఏసీ నాయకులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉద్యోగులు మంగళవారం హైదరాబాద్‌కు తరలివెళ్లనున్నారు. ఉదయం 11 గంటలకు వివిధ మార్గాల్లో ఉద్యోగు లు అసెంబ్లీకి చేరుకోవాలని నాయకత్వం రూట్ మ్యాప్‌ను సైతం అందజేసింది. మరోవైపు చలో అ సెంబ్లీని విఫలం చేయడం కోసం పోలీసు శాఖ చ ర్యలు చేపట్టింది. ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్ వారు అందజేసిన సమాచారం మేరకు జిల్లాల్లోనే ఉద్యోగు లను నిలువరించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2వేల మంది ఉద్యోగులు

సమగ్రశిక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 20వేల మంది పనిచేస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో 2వేల మంది ఉద్యోగుల ఉండగా వీరు సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంతో పాటు కేజీబీవీలు, ఎంఈవో కార్యాలయాలు, భవిత కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వివిధ పోస్టుల్లో పనిచేస్తున్నారు.

పర్మినెంట్ చేయాలి



ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్ష పరిధిలోని అన్ని విభాగాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కాకుండా విద్యాశాఖలో వెట్టిచాకిరీ చేస్తున్న మా శ్రమ దోపిడీని సామాజిక సమస్యగా గుర్తించి మా కుటుంబాలకు న్యాయం చేయాలి.

– రాజు, జనరల్ సెక్రెటరీ, సమగ్ర శిక్ష జేఏసీ, నిజామాబాద్

సమస్యలు పరిష్కరించాలి



ఎస్ఎస్ఏ కాంట్రాక్టు ఉద్యోగులందరికీ యథాస్థానంలో పర్మినెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలి. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాటను నమ్మి అధికార మార్పులో క్రియాశీలంగా వ్యవహరించాం. ఇప్పుడు కాలయాపన చేయడం తగదు.

– ప్రకాశ్, సమగ్ర శిక్ష జేఏసీ నాయకుడు, నిజామాబాద్

పదేళ్లుగా పోరాటం

వీరు గత పదేళ్లకు పైగా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణలో కేసీఆర్ హామీలు నమ్మి తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని ఆశపడినా సమగ్ర శిక్ష ఉద్యోగులకు మొండి చెయ్యే ఎదురైంది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ డిమాండ్లు సాధించుకోవడానికి నడుం బిగించారు. గతేడాది ఉద్యోగులు ఉద్యమబాట పట్టగా.. సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా శిబిరాలను ప్రతిపక్ష నాయకుడి హోదాలో రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్, బీజేపీ ప్రజా ప్రతినిధులు, నాయకులంతా సందర్శించి సంఘీభావం తెలిపారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే వారి సమస్యలు పరిష్కరిస్తామంటూ కాంగ్రెస్ నేతలు హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలపై ఊసెత్తడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఒకవైపు ఏళ్ల తరబడి వేతనాల పెంపు లేకపోగా.. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు సమగ్రశిక్ష ఉద్యోగులకు సైతం 61 ఏళ్లు నిండగానే పదవీ విరమణ చేసి ఖాళీ చేతులతో ఇంటికి పంపించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఉద్యోగులు మరోమారు ఉద్యమానికి సిద్ధమయ్యారు.



సమగ్ర శిక్ష ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)

వాన పడేనా.. 'లోటు' తీరేనా?

జిల్లాలో నిండని చెరువులు

- నిరాశాజనకంగానే ప్రాజెక్టులు
- వారంపాటు ముసురేసినా లోటు వర్షపాతమే
- భారీ వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు



కామారెడ్డి క్రైం : వానాకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఇప్పటివరకు భారీ వర్షాల జాడ లేకపోవడంతో ప్రాజెక్టులు బోసిపోతున్నాయి. చెరువుల్లోనూ అరకొరగానే నీరు చేరడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరంగా వర్షాలు కురుస్తున్నా.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాత్రం తేలిక పాటి వర్షాలే పడ్డాయి. గతేడాది జూలై చివరికల్లా 610 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా.. ఈసారి మాత్రం 420 మిల్లీ మీటర్ల వర్షమే పడింది. దీంతో భూగర్భజలాలు కూడా ఆశించిన స్థాయిలో పెరగలేదు. దీంతో సాగు పనులూ ముందుకు సాగడం లేదు. బాన్సువాడ డివిజన్‌లో మాత్రమే ఎక్కువగా వరి నాట్లు వేశారు. ఇంకా నాట్లు పడుతున్నాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్‌ల పరిధిలో బోరు బావుల కింద వరి నాట్లు ప్రారంభ దశలో ఉన్నాయి.

జలకళ సంతరించుకోని జలాశయాలు

జిల్లాలో పది రోజులుగా వర్షాలు పడుతున్నప్పటికీ చెరువులు, కుంటల్లోకి ఇప్పటికీ సమృద్ధిగా నీళ్లు చేరలేదు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా 1,389.08 అడుగుల(3.693 టీఎంసీలు) నీరు మాత్రమే నిల్వ ఉంది. పోచారం ప్రాజెక్టులో 11 అడుగుల(0.552 టీఎంసీ) నీరు మాత్రమే ఉంది. భారీ వర్షాలు పడి వరద నీరు జలాశయాల్లోకి చేరితేనే భూగర్భ జలాలు పెంపొందే అవకాశాలున్నాయి.

ఆగస్టుపైనే ఆశలు..

జిల్లాలోని నస్రుల్లాబాద్ మండలంలో భారీ వర్షాలు కురిశాయి. మద్నూర్, బిచ్కుంద, భిక్కనూరు, బాన్సువాడ, తాడ్వాయి, డోంగ్లీ మండలాల పరిధిలో సాధారణం కంటే ఎక్కువ వానలు పడ్డాయి. మిగతా అన్ని మండలాల పరిధిలో సాధారణం అంతకంటే తక్కువ వర్షపాతమే నమోదైంది. జూలై నెల కూడా గడిచిపోవడంతో ఆగస్టుపై ఆశలు పెట్టుకున్నారు. వరుణుడు కరుణించి భారీ వర్షాలు కురిస్తేనే వ్యవసాయం ముందుకు సాగుతుంది. వచ్చే నెలల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అంచనా వేస్తుండడంతో రైతులు కొంత ఊరట చెందుతున్నారు.